క్లుప్తంగా

శ్మశానవాటిక భూమి పరిశీలన



శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోని సర్వే నంబర్ 431లోని 6.30 ఎకరాల భూమి, కొత్తపల్లి శ్మశానవాటిక భూమిని తాహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్ఐ సత్యనారాయణ, సర్వేయర్ మనోజ్‌రావు శనివారం పరిశీలించారు. శ్మశానవాటిక భూమి కబ్జా చేసి కోట్లు గడిస్తున్నారని శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శ్మశానవాటిక భూమి కబ్జాపై విచారణ చేట్టారు. పూర్తి వివరాలు అందిన తదుపరి పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

పోలీసులు అప్రమత్తం



హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మోహరించిన పోలీసులు

హుజూరాబాద్: స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని వరంగల్ జిల్లా సుబేదారి పోలీసులు అరెస్టు చేయడంతో స్థానికంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా హుజూరాబాద్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు అమానుషమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, పెండింగ్ పనుల కోసం ప్రజల పక్షాన పోరాడుతున్న వ్యక్తిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించం

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదని యువజన కాంగ్రెస్ నాయకుడు చిన్నాల శ్రీకాంత్ పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి రాజకీయంగా, వ్యాపారపరంగా మంచి పేరుందని, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పరువుతీస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు పెట్టిస్తానని డబ్బు వసూల్ చేసిన వ్యక్తి కౌశిక్‌రెడ్డి అని ఆరోపించారు. నాయకులు రమేశ్, రాజు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: పట్టణంలోని బూసారపు వెంకటేష్ ఉత్తర ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా కాంగ్రెస్ పట్టణశాఖ మాజీ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ విద్యార్థిని అభినందించారు. ఈ మేరకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పెరుమాండ్ల గంగయ్యగౌడ్, సంబోజి సునీల్, బుర్ర హరీశ్‌గౌడ్, బూసారపు శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



రాకేశ్(ఫైల్)

ఇల్లందకుంట: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం .. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఎరబాటి కృష్ణ- లత దంపతుల కొడుకు రాకేశ్(29) గ్రామంలో నిర్మాణరంగం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో ఈ నెల 20న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



హుజూరాబాద్ కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఏసీపీ, కోర్టు న్యాయవాదులు, సిబ్బంది



యోగా చేస్తున్న విద్యార్థులు

యోగోత్సవం

హుజూరాబాద్/రామడుగు/గంగాధర/చిగురుమామిడి/జమ్మికుంట/చొప్పదండి/హుజూరాబాద్‌రూరల్/శంకరపట్నం/గన్నేరువరం/మానకొండూర్: హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల్లో శనివారం యోగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. హుజూరాబాద్ కోర్టు ఆవరణలో ఏసీపీ వాసంశెట్టి మాధవి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. రామడుగు మండలంలోని ప్రగతి పాఠశాల, గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేశారు. చిగురుమామిడి జెడ్పీ స్కూల్‌లో మండల విద్యాధికారిణి పావని, మెడికల్ ఆఫీసర్ అప్సాన ఆధ్వర్యంలో, చిన్నముల్కనూర్ మోడల్‌స్కూల్, చిగురుమామిడి పంచముఖాంజనేయస్వామి ఆలయం ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు పోలోజు సంతోష్‌కుమార్, ట్రైనర్ ఆవుల కుమార్ పాల్గొన్నారు. జమ్మికుంటలోని బాలుర పాఠశాలలో ఎన్‌సీసీ అధికారి మ్యాకమల్ల శ్రీనివాస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, చొప్పదండిలోని రాంలీలా మైదానం, జవహర్ నవోదయ విద్యాలయం, హుజూరాబాద్‌రూరల్ మండలం సింగాపూర్‌లోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్, ఎన్‌సీసీ అధికారి కల్లెం రవీంద్రబాబు ఉన్నారు. శంకరపట్నంలో గురువు గోపు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లపల్లి హెచ్‌ఎం కోటేశ్వరరావు, కేశవపట్నం పీహెచ్‌సీ, మోడల్‌స్కూల్‌లో వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. గన్నేరువరంలో బీజేపీ మండలాధ్యక్షుడు తిప్పర్తి నికేశ్, పారువెల్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయ్‌పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మానకొండూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, గంగిపల్లిలోని శ్రీసరస్వతీ విద్యామందిర్‌లో అంతర్జాతీయ యోగా వేడుకలు జరిగాయి.



మానకొండూర్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



రామడుగు : విద్యార్థుల యోగా విన్యాసాలు



చొప్పదండి: నవోదయ విద్యాలయంలో..



కిట్స్ కళాశాలలో..



జమ్మికుంట: కళాశాలలో..



చిగురుమామిడి జెడ్పీ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



శంకరపట్నం : కేశవపట్నంలో..



గన్నేరువరం : బీజేపీ ఆధ్వర్యంలో..

పేదల సంక్షేమానికి కృషి

జమ్మికుంట: మోత్కులగూడెంలోని శక్తి కేంద్ర పరిధిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనలో ఉచిత రేషన్, పీఎం ఆవాస యోజన, ఉజ్వల, వీధి వ్యాపారులకు ముద్ర లోన్, పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారం, నిరుద్యోగులకు మేకిన్ ఇండియా వంటి అనేక పథకాలను అమలు చేసిందని అన్నారు. నాయకులు రాజేందర్, బూత్ అధ్యక్షుడు పొన్నగంటి రవికుమార్, తాటికంటి మల్లేశం, రావుల మహిపాల్, తాటిపల్లి తిరుపతిగౌడ్, దాసరి నర్సయ్య, పోచయ్య, చేర్యాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



రచ్చబండలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

స్వీట్లు పంపిణీ



స్వీట్ తినిపిస్తున్న నాయకులు

రామడుగు: మండలానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) మంజూరు చేయించడంపై యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు అనుపురం పరశురాంగౌడ్, మామిడి దిలీప్‌కుమార్, అక్షయ్‌కుమార్, రాహుల్, పంజాల వంశీ, సాగర్, రమేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింపు

చిగురుమామిడి: మండలంలోని రామంచ మోయతుమ్మెద వాగులో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్సీ వర్గానికి చెందిన మాస్టిన్ కులస్తులు శనివారం అడ్డుకున్నారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ఇసుకను తీయడంతో తమకు సాగుకు యోగ్యం లేకుండా పోతోందని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, మాస్టిన్ కులస్తుల మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న చిగురుమామిడి తహసీల్దార్ ఎం.రమేశ్, తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్, చిగురుమామిడి ఎస్సై ఎస్.శ్రీనివాస్ వాగుకు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు.



చిగురుమామిడి: మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్, తహసీల్దార్ రమేశ్

ఎస్సైకి సన్మానం




సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

శంకరపట్నం: కేశవపట్నం ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శేఖర్‌రెడ్డిని శనివారం పోలీస్‌స్టేషన్‌లో అంబేద్కర్ సంఘం నాయకులు, ఎమ్ఆర్‌పీఎస్ నాయకులు సన్మానించారు. మండల అధ్యక్షుడు అంతడ్పుల సతీశ్, మాజీ సర్పంచ్‌లు రాజయ్య, భద్రయ్య, నాయకులు శంకర్, శ్రీనివాస్, భాస్కర్, రవి, మధునయ్య, భూమయ్య, సముద్రాల సంపత్ ఉన్నారు.

విచ్చలవిడిగా మట్టి తవ్వకం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ పెద్ద చెరువులో విచ్చలవిడిగా మట్టి తవ్వకం చేపట్టారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. పెద్ద చెరువులో జేసీబీ ద్వారా టిప్పర్లతో పరిమితికి మించి లోతుగా అక్రమంగా మట్టి తవ్వకం చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఐదు రోజులుగా ఇరిగేషన్ శాఖ అధికారుల సహకారంతో రోడ్డు పనులు చేసే కాంట్రాక్టర్ మట్టి తవ్వకాలు చేపట్టాడని, వెంటనే చెరువును తవ్వడం నిలిపివేయాలని, నిబంధనలకు విరుద్ధంగా చెరువును తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గుమ్లాపూర్ పెద్ద చెరువులో జేసీబీతో మట్టి తవ్వకాలు

వేంకటేశ్వరపల్లిలో అడ్డుకున్న గ్రామస్తులు

జమ్మికుంట రూరల్: మండలంలోని వేంకటేశ్వరపల్లి గ్రామంలో చెరువులో నల్లమట్టి తరలింపును శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. 100 కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనుమతి ఉంటే మట్టి తరలించాలని.. లేదంటే నిలిపివేయాలని టౌన్ సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ మహేశ్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



చెరువులో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు

నేడు భవనానికి శంకుస్థాపన

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని మానేరు డ్యాం వద్ద శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో నూతనంగా నిర్మించనున్న తరగతి గదుల భవనాన్ని ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించనున్నట్లు శాతవాహన వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కరీంనగర్‌కార్పొరేషన్: ఆదర్శనగర్‌లోని పలువురు లబ్ధిదారులకు మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ శనివారం సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. గుండు సరిత, ఆరెపల్లి రాజేశ్వరి, మొహమ్మద్ హమీదాబానుకు అందించారు.

'మిషన్' నీళ్లు వృథా!

హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకయ్యింది. దీంతో నీరంతా వృథాగా పోతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా.. పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు.

– హుజూరాబాద్



కాకతీయ కాలనీలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

20వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులు

హుజూరాబాద్: పట్టణంలోని 20వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులు జరిగినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. వార్డులోని ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటుగా, మురుగు కాలువలను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించినట్లు తెలిపారు. మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.



వార్డులో పిచ్చి మొక్కల తొలగింపు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- కేంద్ర మంత్రి బండి, ఎమ్మెల్యే కవ్వంపల్లి



ప్రారంభిస్తున్న బండి సంజయ్, కవ్వంపల్లి

తిమ్మాపూర్: మానకొండూర్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో రూ.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, అభివృద్ధికి అవి అడ్డంకిగా ఉండకూడదన్నారు. మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని, ఎమ్మెల్యే కవ్వంపల్లితో కలిసి పనిచేస్తానని తెలిపారు. గన్నేరువరం- కరీంనగర్ మధ్య దూరాన్ని తగ్గించేందుకు మానేరుపై వంతెన నిర్మాణం కోసం కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ పార్టీలు వేరైనా అభివృద్ధి విషయంలో అన్నదమ్ముల్లా కలిసి పనిచేస్తామన్నారు. తహసీల్దార్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ మంజుల భార్గవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి



హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం బాధ్యులు

హుజూరాబాద్: తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం బాధ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



చిగురుమామిడిలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పించిన నాయకులు

చిగురుమామిడి: తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి శనివారం నిర్వహించారు.గాంధీనగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు పోలోజు సదాచారి, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సదాచారి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణాచారి, సహాయ కార్యదర్శి సూర్యప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్: ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వమిచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖాధికారి రావిలాల శ్రీనివాస్ అన్నారు. శనివారం కేసీ క్యాంపులోని రైతు వేదిక కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలు, పథకాలపై అవగాహన సదస్సు జరిగింది. ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలు, పూలు, పసుపు, అల్లం వంటి పంటల నుంచి అధిక దిగుబడులు, ఆదాయం పొందొచ్చన్నారు. జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలు జి.వేణుగోపాల్ మాట్లాడుతూ.. బంతి, మల్లె, అరటి, బొప్పాయి, గులాబీ పూల సాగుపై వివరించారు. ఏవో భూమిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. మండల ఉద్యాన అధికారిణి మంజువాణి ఉద్యాన పథకాలు దరఖాస్తు చేసుకునే విధానం వివరించారు. ఏడీ సెరికల్చర్ రషీద్ పట్టు పురుగుల పెంపకంపై వివరించారు. ఏఈవోలు నిఖిల్, అనూష, సౌమ్య, స్రవంతి, రైతులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న అధికారి శ్రీనివాస్

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం

జమ్మికుంట: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వరంగల్ జిల్లా సుబేదారి పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్ ఖండించారు. పట్టణంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేపై తప్పుడు కేసు పెట్టినా, ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటం ఆగదన్నారు.



మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్

ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్‌కల్చరల్: అనుమతి లేని ఇంటర్ కళాశాలలు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి వి.గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించి ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కేశబోయిన రాము, మామిడిపల్లి హేమత్, నాయకుడు కసిరెడ్డి సందీప్‌రెడ్డి తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ బాధ్యులు

కళాకారులకు సన్మానం

కరీంనగర్ కల్చరల్: నగరంలో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సంగీత దినోత్సవ కార్యక్రమంలో కళాకారులకు సన్మానం చేశారు. రచయిత, కాలమిస్ట్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. పండిత పామరులను రంజింపజేసేది సంగీతమని అన్నారు. మహోన్నత వ్యక్తులు అమూల్య జీవితాలను సరస్వతీ మాత సేవకు అంకితం చేశారని పేర్కొన్నారు. క్లబ్ కార్యదర్శి డాక్టర్ ఎస్.మనోహరాచారి మాట్లాడుతూ.. మన భారతీయ కళలు ఎంతో గొప్పవని, వాటిని భావితరాలకు అందించాల్సి బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. సన్మాన గ్రహీతల్లో కేబీ శర్మ, వడిగేపల్లి రంగాచార్యులు, కదార్ల సుదర్శన్, కొండపర్తి పోతులూరి తదితరులున్నారు.



సన్మాన గ్రహీతలతో నిర్వాహకులు